క్లుప్తంగా

భూరీసర్వే త్వరగా పూర్తిచేయాలి



రీసర్వే రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

లక్కవరపుకోట: సమగ్ర భూరీసర్వేను త్వరగా పూర్తిచేయాలని విజయగనరం ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ సర్వే సిబ్బందికి సూచించారు. మండలంలోని పోతంపేట గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వేను గురువారం ఆమె పరిశీలించారు. సిబ్బంది తో ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఎన్ని సర్వే నంబర్లలో, ఎంత భూమిని సర్వే పూర్తి చేశారని సర్వేయర్ గ్రంధి రామంను అడిగి తెలుసుకున్నారు. సర్వేకి సంబంధించి రైతులకు జారీ చేసిన నోటీసులు, ఎఫ్ఎంబీ వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ టి.రామకృష్ణ, డీటీ వి.రాజేష్, ఆర్ఐ సీహెచ్.రాజేష్, వీఆర్ఓలు ఉన్నారు.

కొనసాగుతున్న శత చండీయాగం



హోమం నిర్వహిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: పట్టణంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ నివాసంలో ఈనెల 3వ తేదీన ప్రారంభించిన శత చండీయాగం మూడోరోజు గురువారం కొనసాగింది. హోమ మహో త్సవం లో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ శ్రీదేవి దంపతులు, వారి కుమారుడు వంశీకృష్ణ, పావని దంపతులు పాల్గొన్నారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 వరకు హోమం నిర్వహించారు. మరో రెండు రోజుల పాటు యాగం కొనసాగనుంది.

పాఠశాల సందర్శన



విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంపీడీఓ పట్నాయక్

వేపాడ: మండలంలోని బొద్దాం ఉన్నత పాఠశాలను ఎంపీడీఓ కె.ఎస్.ఎన్.కె.పట్నాయక్ గురువారం సందర్శించారు. పాఠశాలలో వసతులను, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. గణితం, ఆంగ్లంలో విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపా యాలను సద్వినియోగించుకుని, చక్కగా చదువుకోవాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న వాకాడ గోపి

చీపురుపల్లిరూరల్(గరివిడి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని గర్భాం ఇండ్‌సిల్ కంపెనీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వాకాడ గోపి కోరారు. గరివిడి ఈఎస్ఐ ఆస్పత్రి ఆవరణలో గురువారం ఆయన మొక్కలు నాటి, ట్రీ గార్డులు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా తమ సంస్థ ఆధ్వర్యంలో విరివిగా మొక్కలు నాటుతున్నామని చెప్పారు. డాక్టర్ డి.మురళీకృష్ణ, స్టోర్ మేనేజర్ ఉప్పు శ్రీను, పక్కి శ్రీను,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు



పోరలి వద్ద సాగులో ఉన్న మొక్కజొన్న

దత్తిరాజేరు: మండలంలో మొక్కజొన్నసాగు ఆశాజనకంగా ఉందని వ్యవసాయశాఖ సిబ్బంది చెబుతున్నారు. గడసాం, పోరలి, దాసుపేట, సరయ్యవలస, లింగాలవలస, భూపాలరాజపురం,పెదమానాపురం తదితర గ్రామాల్లో బోర్లు ఆధారంగా సుమారు 1000 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడి, తక్కువ నీటితడులతో పంట చేతికందడంతో రైతులు ఈ పంటసాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వ గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు రైతు భరోసా కేంద్రాల్లో పంటను కొనుగోలు చేస్తోంది. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉందని, మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

పేదల కష్టం తెలిసిన వ్యక్తి సీఎం జగన్

- పేద ప్రజల తలరాతలు మార్చేలా సంక్షేమ పథకాలు అమలు
- పింఛన్ల పెంపు వారోత్సవాల్లో ఎమ్మెల్యే కడుబండి



విభిన్న ప్రతిభావంతుడైన బాలుడికి పింఛన్ ఇస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట:

పేదప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలో నూతనంగా మంజూరైన 324 నూతన పింఛన్లను లబ్ధిదారులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీడీఓ ఎం.వి.ఏ.శ్రీనివాసరావు నేతృత్వంలో గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నివర్గాల్లోని పేదల తలరాతలు మార్చేలా మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో వివిధ సంక్షేమ పథకాల రూపంలో రూ.1.80 లక్షల కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లో జమచేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను మూడు దఫాలు పెంచి మొత్తంగా రూ.2,750 అందిస్తున్నామని తెలిపారు. దేశంలో ఇంత మొత్తంలో పింఛన్ ఇస్తున్న రాష్ట్రం మనది మాత్రమేనని ప్రజలు గుర్తించాల న్నారు. ఎక్కడా అవినీతికి అవకాశం లేకుండా 1వ తేదీ ఉదయాన్నే తలుపుతట్టి పింఛన్ అందిస్తున్న వలంటీర్ వ్యవస్థ మనరాష్ట్రంలో మాత్రమే ఉందన్నారు. నియోజకవర్గంలో రూ.800 కోట్లు పేదల ఖాతాల్లో జగన్ ప్రభుత్వం జమ చేసిందన్నారు.

మనసున్న నేత జగన్

ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ సీఎం జగన్ మనసున్న నేత అని, ప్రతి నెలా ఠంచన్‌గా ఒకటో తేదీనే పింఛన్ అందిస్తున్నారని అన్నారు. అర్హులందరికీ పథకాలు మంజూరు చేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు హయాంలో ఒక ఊరులో ఎవరికైనా కొత్తగా పెన్షన్ కావాలంటే ఆ ఊరులో అప్పటికే పెన్షన్ అందుకుంటున్న వారిలో ఎవరో ఒకరు చనిపోతే వారి స్థానంలో కొత్త వారికి ఇచ్చే పరిస్థితి ఉండేదన్నారు. నేడు అర్హులందరికీ పెన్షన్ అందుతోందని అన్నారు. పేదల పక్షపాతి అయిన జగన్‌ను మళ్లీ సీఎంగా చేయడం మనందరి కర్తవ్యం అని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులున్నా పేదల సంక్షేమంలో ప్రభుత్వం వెనకడుగు వేయడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాధం మాట్లాడుతూ నాడు జన్మభూమి కమిటీలు కమీషన్లు తీసుకుని పథకాలు ఇస్తే, నేడు జగన్ నాయకత్వంలో అవినీతికి తావులేకుండా పథకాలు మంజూరు చేస్తున్నారని చెప్పారు. వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, సర్పంచ్‌లు కె.వెంకటరావు, జుత్తాడ సూర్యారావు, మంచిన కోటిబాబు, ఒబ్బిన పార్వతి, ఉప సర్పంచ్ మోపాడ కుమార్, పుణ్యగిరి ట్రస్టుబోర్డు చైర్మన్ పి.రామకృష్ణ పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా అర్హులకు పథకాలు



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

దత్తరాజేరు: పార్టీలకు అతీతంగా అన్నివర్గాల్లోని అర్హులకు పారదర్శకంగా పథకాలు మంజూరు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలానికి మంజూరైన 214 నూతన పింఛన్లను స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సభలో ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ కావాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, అయినా పింఛన్ రావడం కష్టమయ్యేదని గుర్తు చేశారు. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే ఇంటికి వచ్చి మరీ పింఛన్లు, ఇతర పథకాలు మంజూరు చేస్తున్నామని, జగన్ లాంటి పేదల కష్టాలు తెలిసిన వ్యక్తి సీఎంగా ఉండడం మన అదృష్టమని అన్నారు. ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతురాజేశ్వరి,వైస్ ఎంపీపీలు అప్పలనాయుడు, రమేష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కడుబండి రమేష్‌నాయుడు, మండల వ్యవసాయ సల హా మండలి చైర్మన్ త్రినాథరావు, మాజీ జెడ్పీటీసీ, ఎంపీపీ ఎం.అప్పలనాయుడు, తిరుపతి పాల్గొన్నా రు.

నేడు..

గజపతినగరం: మండలంలో నూతనంగా మంజూరైన పింఛన్లను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య శుక్రవారం పంపిణీ చేయనున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భూసమస్యలకు రీసర్వేతో చెక్



చీపురుపల్లిరూరల్ : రైతులకు భూహక్కు పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగం ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర భూరీసర్వేతో ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, ఎంపీటీసీ కడుమల రాంబాబు అన్నారు. గరివిడి మండలంలోని రేగటి పంచాయతీ పరిధి చందాపురం గ్రామంలో భూరీ సర్వే పూర్తవడంతో రైతులకు గురువారం భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే భూరీసర్వే

బొండపల్లి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా సమగ్ర భూరీసర్వేను రైతుల సమక్షంలోనే నిర్వహిస్తున్నామని సమగ్ర భూరీసర్వే డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్ తెలిపారు. మండలంలోని ముద్దూరు గ్రామంలో గురువారం నిర్వహించిన సర్వేను ఆయన పరిశీలించారు. సంబంధిత పొలాల వద్ద రైతులు లేకుండా సర్వే చేయవద్దని సర్వేయర్లకు సూచించారు. సర్పంచ్ మునకాల పైడిపునాయుడు ఆయన వెంట ఉన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ నిర్మలాదేవి

గజపతినగరం: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులపై పంచాయతీ సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)నిర్మలాదేవి ఆదేశించారు. మండల కేంద్రంలో గురువారం ఆమె పర్యటించారు. పారిశుధ్య పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామ పంచాయతీకి చెందిన ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. స్థలాన్ని సర్వేచేయించి, పంచాయతీ తీర్మానం మేరకు త్వరగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో తనిఖీలు చేశారు. డీపీఓ వెంట ఈఓపీఆర్డీ జనార్ధనరావు, గజపతినగరం, పురిటిపెంట పంచాయతీ కార్యదర్శులు జనార్ధనరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో సాగుబాగు



గజపతినగరం రూరల్: డ్రోన్‌తో పురుగు మందు పిచికారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గజపతినగరం రూరల్: మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలంబించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి త్రినాథ స్వామి రైతులకు సూచించారు. మండలంలోని శ్రీరంగరాజపురంలో వ్యవసా యంలో డ్రోన్‌ల వినియోగంపై రైతులకు గురువారం క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. సాధారణ స్ప్రేయర్లతొ పంటలకు పురుగుమందుల పిచికారీ చేయడం కంటే డ్రోన్‌ల సాయంతో చేస్తే పంట మొత్తానికి సమానంగా మందు పిచికారీ అవుతుందని చెప్పారు. మొక్కజొన్న, వరి పంటల కోత అనంతరం పంట వ్యర్థాలను పొలాల్లో తగలబెట్టవద్దని సూచించారు. వ్యర్థాలను తగలబెట్టడం వల్ల కాలుష్యం పెరగడంతో పాటు భూమిలోని పంటకు మేలు చేసే మిత్ర పురుగులు నాశనమవుతాయని చెప్పారు. వ్యర్థాలను కాల్చకుండా యంత్రాలతో కట్ చేసి దుక్కిలో కలిపేస్తే భూసారం పెరుగుతుందని అన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త తేజేశ్వరరావు, ఏడీలు నాగభూషణరావు, మహరాజన్, ఏఓ ధనలక్ష్మి, ఏఎబీ చైర్మన్ సామంతుల పైడిరాజు పాల్గొన్నారు

తరచూ పంట మార్పిడి చేసుకోవాలి

దత్తిరాజేరు: తరచూ ఒకే రకం పంట కాకుండా పంటల మార్పిడి చేసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయశాఖ జేడీ త్రినాథస్వామి అన్నారు. మండలంలోని పోరలి గ్రామంలో గురువారం సాయంత్రం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరితో పాటు మొక్కజొన్న,పెసర,మినుము తదితర పంటలను సాగు చేసుకోవాలని చెప్పారు. ఏడీ మహరాజన్, ఏఓ అనురాధ, ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దన్నాన త్రినాథరావు, మాజీ జెడ్పీటీసీ మంత్రి అప్పలనాయుడు, వీఏఏ భాస్కర్ పాల్గొన్నారు

వాకర్స్ క్లబ్ సేవలు అవసరం



ప్రమాణస్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

విజయనగరం: సమాజానికి వాకర్స్ క్లబ్ సేవలు ఎంతో అవసరమని క్లబ్ గవర్నర్ కర్రోతు సత్యం అన్నారు. పట్టణంలోని బ్యాంక్ కాలనీ ప్రజా గ్రంథాలయం ఆవరణలో బాలాజీ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా గవర్నర్ సత్యం మాట్లాడుతూ, నడక ప్రాముఖ్యతను సమాజానికి తెలియజేయడంతో పాటు వివిధ సేవా సంక్షేమ కార్యక్రమాల ద్వారా వాకర్స్ క్లబ్బులు సమాజంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం, మినీ వాటర్ ప్లాంట్ల నిర్మాణం, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పన, తదితర సేవా కార్యక్రమాలను తమ క్లబ్ ద్వారా మరింత విస్తృతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఐ. రామరాజు కొత్త కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పూర్వ గవర్నర్ కృష్ణంరాజు, ఎర్రినాయుడు, ఎంవీఎస్ భగవాన్, నాలుగెస్సుల రాజు, శ్రీరామ్మూర్తి, డి. నాగలక్ష్మి, బీకే సింహాచలం, వి. సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

కొత్తవలస : మండలంలోని గులివిందాడ సమీపంలో రహస్య ప్రదేశంలో నాణెం తిప్పే ఆట ఆడుతుండగా సీఐ ఎస్.బాలసూర్యారావు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ 23,360 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

గజపతినగరం: గజపతినగరం దిగువ వీధిలో పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు గురువారం సాయంత్రం ఎస్సై గంగరాజు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడి చేసినట్లు, వారి నుంచి రూ.1370 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ అప్పలనాయుడు

గజపతినగరం: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే వాహనచోదకులపై చట్టపరమైన చర్యలు తప్పవని స్థానిక సీఐ ఎల్.అప్పలనాయుడు అన్నారు. స్థానికి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లతో గురువారం ఆయన సమావేశమ య్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైనర్లకు ఆటోలు ఇస్తే సంబంధిత ఆటో యజమానిపై కేసులు నమోదు చేస్తామన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా, మద్యం తాగి ఆటో నడిపినా చర్యలు తప్పవని హెచ్చ రించారు. ఎస్ఐ గంగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం



డ్రైనేజ్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ కొండమ్మ

గజపతినగరం: గ్రామాల్లో మౌలిక వసతులకల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని సర్పంచ్ నరవ కొండమ్మ అన్నారు. మండలంలోని ఎన్.జి.ఆర్.పురంలో రూ.3 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడుతో కలిసి గురువారం భూమిపూజ చేశారు. గ్రామంలో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణంతో పాటు శ్మశాన వాటికను అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. స్థానిక నాయకులు కర్రి నానాజీ, ఈ.గణపతి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాల స్వామి తిరుప్పావడ సేవ



స్వామి వారికి నివేదించిన పులిహోర, నైవేద్యాలు

జామి: మండలంలోని అన్నంరాజుపేట వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు ఫణిహారం సీతారామాచార్యుల ఆధ్వర్యంలో తిరుప్పావడ సేవ గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామివారు, గోదాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు,అభిషేకాలు చేసి 108 కిలోల పులి హోర, స్వీట్లు, నైవేద్యాలు నివేదించారు. గోదాదేవి అమ్మవారికి పల్లకీ సేవ చేశారు.

నవరత్న పథకాలతో పేదల ప్రగతి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

జామి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలు పేదల ఆర్థిక ప్రగతికి ఎంతో దోహదపడుతున్నాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అలమండ సచివాలయం పరిధి కుద్దిపాలెం గ్రామంలో గురువారం 'గడప గడపకు మనప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో జగనన్న అమ్మఒడి పథకం అమలు చేస్తూ బడికి పిల్లలను పంపించే తల్లుల ఖాతాల్లో ఏటా రూ.15 వేలు జమచేస్తున్నామని చెప్పారు. అలాగే విద్యార్థులకు విద్యాకానుక పేరిట నోట్, పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, యూనిఫాం, బెల్టులు అందిస్తున్నామని, జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా నాణ్యమైన భోజనం అందిస్తున్నామని వివరించారు. పాఠశాలలు, ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతిరహిత పాల అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్లె సరయు,ఎంపీపీ సబ్బవరపు అరుణ,మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గొర్లె రవికుమార్, మాజీ ఎంపీపీ కాకర్ల పూడి సూరిబాబురాజు,'వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు,ఃసర్పంచ్ కోట పాపమ్మ,ఉప సర్పంచ్ లగుడు దేముడు, సచివాలయ సిబ్బంది,వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు



ఎంపీ నివాసంలో పట్టాలు పంపిణీ చేస్తున్న బెల్లాన వంశీకృష్ణ



జెడ్పీటీసీ కార్యాలయంలో పట్టాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసనాయుడు

చీపురుపల్లి: పేదల సొంతిటి కల సాకారం చేసేందుకు అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలతో ఇళ్లు మంజూరు చేస్తోందని వైఎస్సార్ సిపి మండల నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ అన్నారు. పట్టణంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ నివాసం వద్ద, మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని జెడ్పీటీసీ చాంబర్‌లో వేర్వేరుగా గురువారం నిర్వహించిన కార్యక్రమాల్లో పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పతివాడ రాజారావు, ఇప్పిలి గోవింద, మంగళగిరి శ్రీను, ఇప్పిలి తిరుమల, ముల్లు పైడిరాజు, దాలయ్య, కల్కి, సత్తిబాబు, ఇప్పిలి కృష్ణ, పీతల మురళి, మల్లింపూడి శ్రీను, సింహాచలం, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సరైన ప్రణాళికలతో అభివృద్ధి



గజపతినగరం: పురిటిపెంట సచివాలయం–2లో నిర్వహించిన గ్రామసభ

వేపాడ: సరైన ప్రణాళికలు రూపొందించి పక్కాగా అమలు చేస్తేనే పంచాయతీలు అభివృద్ధి సాధిస్తాయని ఎంపీడీఓ పట్నాయక్ అన్నా రు. మండలంలోని బొద్దాం, అరిగిపాలెం, సోంపురం, జాకేరు, వీలుపర్తి, వేపాడ, వల్లంపూడి జాకేరు గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గురువారం గ్రామ సభలు నిర్వహించారు. బొద్దాంలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీఓ పట్నాయక్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పాలకవర్గం సమష్టిగా ప్రణాళికలు తయారు చేసి వాటిని ఆమోదించుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, తదితర పనులకు తొలిప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. సర్పంచ్ ఎర్రా రామసత్యవతి, ఎంపీటీసీ పిల్లా లక్ష్మి, ఉపసర్పంచ్ స్వర్ణపూడి వెంకటరమణ, వార్డుమెంబర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

గజపతినగరం: పంచాయతీలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నామని పురిటిపెంట–2 సర్పంచ్ శొంఠ్యాన విజయలక్ష్మి అన్నారు. గురువారం ఆమె అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పాలకవర్గం, అధికారులతో కలిసి అభివృద్ధి ప్రణాళిక తయారీపై చర్చించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ పప్పు సుదర్శనం, స్థానిక వైస్ సర్పంచ్ మండల సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, పంచాయతీ ఈఓ జనార్దనరావు, అట్టాడ లక్ష్మునాయుడు పాల్గొన్నారు.

పల్లెల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



పురిటిపెంటలో నిర్వహించిన వైద్యశిబిరం

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అనూజ్ రాయ్ ఆధ్వర్యంలో గురువారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా 86 మందికి ఓపీ(అవుట్ పేషెంట్) సేవలు అందించారు. అనంతరం గృహసందర్శన చేసి ప్రజలకు వైద్యతనిఖీలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్యపరీక్షలు చేసి, ఆరోగ్యసూత్రాలపై అవగాహన కల్పించారు.

పరిశుభ్రతతో వ్యాధులకు దూరం

గజపతినగరం రూరల్: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే చాలా వరకు వ్యాధుల బారినుంచి తప్పించుకోవచ్చని మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అనూజ్‌రాయ్ అన్నారు. మరుపల్లి ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు గురువారం వైద్యతనిఖీలు చేశారు. పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. భోజనం చేసే సమయంలో తప్పనిసరిగా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు.